క్లుప్తంగా

కులాల మధ్య చిచ్చుపెట్టడం సరికాదు

ఐ.పోలవరం: సీఎం చంద్రబాబు ఇటీవల కుప్పం పర్యటనలో భాగంగా ఎస్సీ వర్గీకరణపై మాదిగలకు సానుకూలంగా హామీ ఇవ్వడం కులాల మధ్య చిచ్చు పెట్టడమేనని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మాల మహానాడు జిల్లా కార్యదర్శి రేవు శ్రీను ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో 164 సీట్లు సాధించడంలో మాలల పాత్ర కూడా ఉందని మరిచిపోరాదన్నారు. సుప్రీంకోర్టులో ఉన్న వర్గీకరణ అంశాన్ని రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం పదే పదే వెలుగులోకి తీసుకొచ్చి మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టడం సరికాదని విజ్ఞప్తి చేశారు.

బైర్రాజు సేవలు ఎనలేనివి


మురమళ్లలో సత్యనారాయణరాజుకు నివాళులు అర్పిస్తున్న ప్రజలు

ఐ.పోలవరం: దాత బైర్రాజు సత్యనారాయణ రాజు సేవలు ఎనలేనివని పలువురు పేర్కొన్నారు. గురువారం సత్యనారాయణరాజు వర్ధంతిని పురస్కరించుకుని మురమళ్ల బైర్రాజు ఫౌండేషన్ కార్యాలయంలో ఆయనకు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇప్పటి వరకూ 7 మిలియన్లకు పైగా రోగులకు వైద్య పరీక్షలు, 26 వేల మంది గ్రామీణ యువతకు జీవనోపాధి నైపుణ్య శిక్షణ, 61 తాగునీటి ప్లాంట్లు, 89 వేల మరుగుదొడ్ల నిర్మాణం తదితర వాటిని చేశారన్నారు. కార్యక్రమంలో దాట్ల సత్యనారాయణ రాజు, జంపన భీమరాజు, పి.సూర్యనారాయణ రాజు, డి.నరసింహరాజు, పొత్తూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు తక్షణమే చెల్లించాలి


పటవలలో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఈశ్వరరావు, ఉపాధి కూలీలు

తాళ్లరేవు: ఉపాధి హామీ వేతనదారులకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పటవల గ్రామ పంచాయతీ వద్ద జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభలో ఉపాధి వేతనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఈశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో కలసి సామాజిక తనిఖీ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఉపాధి హామీ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆయన అన్నారు. ఇప్పటికైనా వేతనదారుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు.

ఉచిత వైద్య సేవలు


తాళ్లరేవు: కోరంగి ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం పాతకోరంగిలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వైద్యురాలు ఎం.విజయ ప్రతిభ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సిబ్బంది ఎం.కోటేశ్వరరావు, ఆశా కార్యకర్త నాగమణి, యోగా శిక్షకులు కరుణాకర్, మహాలక్ష్మి పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుడి మృతి


రాజ్‌కుమార్ (ఫైల్)

అల్లవరం: గోడి బాలుర గురుకులంలో డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న రాజ్ కుమార్ అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురై ఎనిమిది నెలలుగా అనారోగ్యంతో ఉన్నారు. అమలాపురం ఎర్రవంతెన వద్ద నివాసానికి ఆయన మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. రాజ్‌కుమార్ మృతికి గురుకుల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సంతాపం తెలిపారు.

పాఠశాలలో స్వచ్ఛభారత్


మెట్టకూరు హైస్కూల్‌లో శుభ్రం చేస్తున్న విద్యార్థులు

యానాం: స్థానిక మెట్టకూరు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ హైస్కూల్‌లో మనబడి కార్యక్రమంలో భాగంగా గురువారం కమ్యూనిటీ సర్వీస్ స్కీమ్ (సీఎస్ఎస్) వలంటీర్లచే స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, క్రీడా మైదానంలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజారామమోహన్‌రావు, పీఈటీ శేరు విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఊగుతూ.. తూగుతూ..

- పల్లెల్లో యథేచ్ఛగా బెల్ట్ షాపులు
- పట్టించుకోని ప్రభుత్వ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


పోలీసుల దాడిలో పట్టుబడిన మద్యం సీసాలు (ఫైల్)

కాట్రేనికోన: పల్లెలు మత్తులో ఊగుతున్నాయి... తూగుతున్నాయి. పుట్టగొడుగుల్లా వచ్చిన బెల్టు షాపుల్లో యథేచ్ఛగా మద్యం అక్రమ విక్రయాలు సాగుతున్నాయి. అడిగేవారు లేక కొందరి ఇష్టారాజ్యం అయ్యింది. ఈ తంతు కళ్లముందే జరుగుతున్నా అధికారులకు పట్టకపోవడం శోచనీయం. కాట్రేనికోన మండలంలో ఎక్కడ చూసినా ఇలాంటి షాపులే కనిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం మద్యం పాలసీ వచ్చేలోపు శివారు ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన నాన్‌డ్యూటీ ఫెయిడ్ మద్యాన్ని బెల్టు షాపుల్లో అమ్ముతున్నారు. ఈ తంతు ఇటీవల కాలంలో మరింత హద్దు దాటింది. కాట్రేనికోన మండలం చెయ్యేరులో 2, కాట్రేనికోన 4, కందికుప్ప 1, పల్లంకుర్రు 1 చొప్పున ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. మండలంలో మంచినీరు అందని ప్రాంతాలు ఉన్నాయి గాని, వాడవాడలా ఉన్న బెల్టు షాపుల్లో మాత్రం మద్యం దొరుకుతోంది. కాట్రేనికోన గేటు సెంటర్, సుబ్బారాయుడు గుడి, వంతెన సమీపం, చెయ్యేరు, చెయ్యేరు అగ్రహారం, పెనుమల్లే, ఉప్పూడి ఓఎన్జీసీ రోడ్డు సమీపం, కుండలేశ్వరం, వేట్లపాలెం, రాజానగరం, సత్తమ్మ చెట్టు, కాపులపాలెం, దొంతికుర్రు, పల్లంకుర్రు, కందికుప్ప, పల్లం, కొత్తపాలెం, మొల్లేటిమొగ, చిర్రయానం, బలుసుతిప్పతో పాటు ప్రతి గ్రామ కూడళ్లలో బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో కొందరు మద్యం తాగి ఊగుతూ తూగుతుండడంతో మహిళలు అటుగా వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి ఘటనలు చాలాచోట్ల ఉన్నా కనీసం పోలీసులూ స్పందించకపోవడం గమనార్హం. పల్లం, చిర్రయానంలలో కొంత మంది ప్రభుత్వ మద్యం షాపుల్లో సరకు కొనుగోలు చేసి ఆయా ప్రాంతాల్లోని బెల్ట్ దుకాణాల్లో అమ్మకాలు చేస్తున్నారు. మద్యం షాపుల్లో పనిచేస్తున్న కొందరు సిబ్బంది చేతివాటంతో బెల్టు షాపులకు అధిక మొత్తంలో మద్యం చేరుతుందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ మద్యం షాపులో ఛీప్ లిక్కర్ రూ.130 ఉండగా, బెల్ట్ షాపుల్లో రూ.180కు విక్రయిస్తున్నారు. ఇలా ప్రతి సీసాకు అదనంగా రూ.50 వేసి అమ్ముతున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

పుదుచ్చేరి రాష్ట్రానికి చెందిన మద్యం గోదావరి పాయల ద్వారా బోట్లపై మండలంలోని శివారు ప్రాంతాలకు తరలించి అమ్మకాలు సాగించడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. సముద్ర తీర ప్రాంత గ్రామాలు జి.మూలపాలెం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగలలో మద్యం అక్రమ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. విక్రయదారులకు కావాల్సిన మద్యం సొమ్మును మధ్యవర్తులకు చెల్లిస్తే సరుకును బోటు వరకూ అప్పగిస్తారు. అక్కడి నుంచి గోదావరి పాయల ద్వారా బోటులో బలుసుతిప్ప, జి.మూలపాలెం, కొత్తపాలెం, మొల్లేటిమొగ గ్రామాలకు తరలిస్తున్నారు. పుదుచ్చేరి ప్రాంతం యానంలో తక్కువకు కొనుగోలు చేసి రెట్టింపు ధరకు ఇక్కడ విక్రయిస్తున్నారు. బెల్టు షాపులు ఎక్కడెక్కడ ఉన్నాయనే సమగ్ర సమాచారం ఉన్నా పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా వారు స్పందించి మద్యం అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం


గణపతిస్వామిని దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: స్థానిక నల్లా గార్డెన్‌లో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ గణపతి స్వామి ఆలయం వార్షికోత్సవ పూజలు గురువారం వైభవంగా జరిగాయి. లక్ష్మీ గణపతికి ప్రత్యేక అభిషేకాలు, గరిక పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కౌన్సిలర్ గొలకోటి విజయలక్ష్మి, పట్టణ ప్రముఖులు పాల్గొని లక్ష్మీ గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కౌన్సిలర్లు పిండి హైమావతి, ఆశెట్టి నాగదుర్గ, తిక్కా సత్యలక్ష్మి, నాయకులు నూకల షణ్ముఖరావు, గొలకోటి వాసు తదితరులు పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్ జీవితం ఆదర్శం


తాళ్లరేవులో హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దివ్యాంగులు


యానాంలో హెలెన్ కెల్లర్‌కు నివాళి అర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

తాళ్లరేవు: అవయవ లోపాలను అధిగమించిన మహిళ హెలెన్ కెల్లర్ జీవితం అందరికీ ఆదర్శమని ప్రజాఐక్య సంఘాల జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వరరావు అన్నారు. స్థానికంగా ఉషోదయా మండల వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో సమాఖ్య అధ్యక్షుడు కె.శ్రీనివాస్ అధ్యక్షతన హెలెన్ కెల్లర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పలువురు మాట్లాడుతూ వికలాంగుల ఉద్యమాల సారథిగా ప్రపంచ స్థాయిలో పేరుగాంచిన హెలెన్ కెల్లర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చూపు, మాట లేకపోయినా రచయిత్రిగా అనేక దేశాలలో తన ప్రసంగాల ద్వారా ఎంతోమందిలో చైతన్యం నింపారన్నారు. వికలాంగుల సంఘ ప్రతినిధులు సీతామహాలక్ష్మి, సుబ్బలక్ష్మి, శ్రీనివాస్, శివశంకర్, తణుకురాజు, సతీష్ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత..

యానాం: దివ్యాంగుల ఉద్యమాల సారథిగా ఎందరికో స్ఫూర్తిదాయకంగా హెలెన్ కెల్లర్ నిలిచారని వాసవీక్లబ్ అధ్యక్షురాలు సీహెచ్ సర్వలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక రాజీవ్‌రివర్ బీచ్ వద్ద ఉన్న ఉమా ఎడ్యుకేషనల్ సొసైటీ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో హెలెన్ కెల్లర్ జయంతిని సెంటర్ ఇన్‌చార్జి కె.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, స్వీట్లు పంచారు. కార్యదర్శి బి.కాశీఅన్నపూర్ణ, ట్రెజరర్ పి.సరస్వతి, బి.శీతల్, ఎస్‌వీవీ మహాలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

గట్టు దారి.. గుబులే మరి


ఉప్పలగుప్తంలో అధ్వానంగా మారిన అయినాపురం కాలువ గట్టు రహదారి

ఉప్పలగుప్తం: ఆ దారిలో ప్రయాణమంటే హడలెత్తిపోతున్నారు. వర్షం వస్తే మరింత నరకం చూస్తున్నారు. ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి పెద్దూరులో పంట కాలువపై ఆర్అండ్‌బీ రహదారి వద్ద కల్వర్టు చేపట్టారు. దీంతో అటుగా వెళ్లే వాహనాలను అయినాపురం పంట కాలువ వెంబడి దారి మళ్లించారు. ఈ దారి పూర్తి అధ్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదగాడవిల్లి, చినగాడవిల్లి, మునిపల్లి నుంచి ఉప్పలగుప్తానికి రావాలన్నా, అమలాపురానికి వెళ్లాలన్నా ఈ దారే ఆధారం. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆటో, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం పూర్తయ్యేంత వరకూ దారిని బాగుచేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

దివ్యాంగుల డిమాండ్లకు ఆమోదం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న దివ్యాంగ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం దివ్యాంగుల అసోసియేషన్ అధ్యక్షుడు వినాయకమూర్తి ఆధ్వర్యంలో సీఎం రంగసామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు అసెంబ్లీ ఆవరణలో మాట్లాడుతూ పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ కేటగిరీలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు 1,205 మంది ఉన్నారని, వారంతా వివిధ పాఠశాలల్లో చదువుతున్నారన్నారు. వీరందరికి స్పెషల్ ఎడ్యుకేటర్లను నియమించాలని, పదో తరగతి, 12వ తరగతి ప్రభుత్వ పరీక్షలను అంధ విద్యార్థులు రాసేటప్పుడు స్క్రైబ్‌ను అసిస్టెంట్‌గా నియమించాలని, స్పెషల్ కేర్ సెంటర్‌లను ప్రారంభించాలని తదితర డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వాటికి తక్షణం ఆమోదం తెలిపారన్నారు.

ఎడతెరిపి లేని వర్షం


వర్షానికి చిత్తడిగా మారిన మామిడికుదురు - కొర్లగుంట రోడ్డు


అంబాజీపేటలో కురుస్తున్న వర్షం

- రహదారులు జలమయం
- స్తంభించిన జన జీవనం
- పంటలకు మేలంటున్న రైతులు

మామిడికుదురు: వివిధ ప్రాంతాల్లో ఎడతెరిపి లేని భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. గురువారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో రోడ్లపై భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం రాత్రి నుంచి ఓ మాదిరిగా కురుస్తున్న వర్షంతో నగరం, మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల్లో 216వ నంబర్ జాతీయ రహదారిపై పలు చోట్ల వర్షపు నీరు నిలిచిపోయి, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, మాకనపాలెం, ఆదుర్రు, కొమరాడ, ఈదరాడ, మగటపల్లి, గోగన్నమఠం గ్రామాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో మొగలికుదురు కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముసురుతో తొలకరి సాగు కోసం వేసిన నారుమడులకు నష్టం జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం కొబ్బరి తోటలకు మాత్రం మేలు చేస్తోందని కొబ్బరి రైతులు సంతృప్తిగా ఉన్నారు.

సేద తీరిన జనం

అంబాజీపేట: అల్పపీడనం కారణంగా మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. రెండు వారాలుగా ఉక్కపోత, వేడిగాడ్పులతో అల్లాడిన వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఈ వర్షంతో కాస్త సేదతీరారు. రోడ్ల పక్కన చిరు వ్యాపారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెల్లవారుజాము నుంచి తెరిపి ఇవ్వకుండా, వర్షం కురుస్తుండడంతో జన జీవనం స్తంభించింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వరి సాగుకు, కొబ్బరి తోటలకు మేలు చేకూరుతాయని రైతులు చెబుతున్నారు.

సీఎస్ఆర్ నిధులు ఇవ్వాల్సిందే..

- చమురు సంస్థలపై పోరాడదాం
- కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, చిత్రంలో ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలోని ప్రధాన వంతెనలు, రోడ్లను ఓఎన్జీసీ తదితర చమురు సంస్థలకు చెందిన భారీ వాహనాలు ఛిద్రం చేస్తున్న క్రమంలో వాటిని ఆధునీకరించేందుకు ఆ సంస్థలు సీఎస్ఆర్ నిధులు ఇచ్చి తీరాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన గురువారం జరిగింది. దీనికి ఎక్స్‌అఫీషియో సభ్యుని హోదాలో ఎమ్మెల్యే ఆనందరావు హాజరై చమురు సంస్థల నుంచి నిధులు రాబట్టే అంశంపై మాట్లాడారు. ఇక నుంచి మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు సాధించే అంశంలో చమురు సంస్థలపై ఉమ్మడి పోరాటం చేయాలని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ అంశంపై కౌన్సిల్‌తో తీర్మానం చేయించారు. పట్టణంలోని వంతెనలు, రోడ్లపై నుంచి చమురు సంస్థలకు చెందిన భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని నిర్ణయించారు. మున్సిపల్ బిల్డింగ్‌ను అద్దెకు ఇవ్వడం, అంత అద్దె భరించలేక పోతున్నామని ఆ లీజుదారుడు తాను ఒప్పందం నుంచి తప్పుకుంటున్నానని చెప్పిన విషయం చర్చకు వచ్చింది. మున్సిపాలిటీలో కొందరు ఉద్యోగులు నిర్లక్ష్యంగా నిర్ణయాలు తీసుకోవడం, కౌన్సిలర్లు చెప్పినా సరిగా స్పందించని పరిస్థితులపై చర్చించుకున్నారు. ఇలా నిర్లక్ష్య ధోరణిలో ఉండడానికి ఏళ్ల తరబడి వారు ఇదే మున్సిపాలిటీలో పాతుకుపోవడం కారణమని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అన్నారు. పాలకపక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, ప్రతిపక్ష కౌన్సిలర్లు యేడిద శ్రీను, అబ్బిరెడ్డి చంటి కూడా ఒకటో అంశం లీజు రద్దు విషయమై చర్చించారు. కౌన్సిల్ సమావేశానికి తొలిసారిగా వచ్చిన ఎమ్మెల్యే ఆనందరావును ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ మనోహర్, పాలక, ప్రతిపక్షాలకు చెందిన కౌన్సిలర్లు, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు సత్కరించారు. అంతా కలసికట్టుగా అమలాపురాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే అన్నారు.

ఇబ్బందులు ఉంటే చెప్పండి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: పాఠశాలల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణలో ఏమైనా లోపాలు ఉంటే చెప్పాలని విద్యార్థులను ఎంపీడీఓ కృష్ణమోహన్ అడిగారు. కోడూరుపాడులోని జిల్లా ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ ప్రకారం వంటకాలు, గుడ్లు, చిక్కీలు అందుతున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆకతాయిల నుంచి వేధింపులు ఉంటే నిర్భయంగా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. తొలుత స్కూల్ ఆవరణలో ఓహెచ్ఆర్ ట్యాంక్ వద్ద నీటి నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ లక్ష్మణరావు, కార్యదర్శులు సత్యనారాయణ, శ్రీనివాస్, రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు నేడు అంతరాయం

ముమ్మిడివరం: విద్యుత్ తీగల నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. 11 కేవీ లైన్ మరమ్మతుల దృష్ట్యా మండలంలోని అన్ని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆరోగ్య సిబ్బంది దీక్షలు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఆరోగ్యశాఖలో ఉద్యోగులుగా పనిచేస్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు, పలువురు ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం గురువారం స్థానికంగా నిరాహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య శాఖలో ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తూ ఆకస్మికంగా మృతిచెందిన వారి వారసులకు ప్రతి ఏడాది ఉద్యోగాల భర్తీలో 5 శాతం ఉద్యోగాలను కేటాయిస్తున్నారని, కానీ తొమ్మిదేళ్లుగా వారసులకు పోస్టులు ఇవ్వడం లేదన్నారు. ఈ విధంగా సుమారు 137 మంది ఉన్నారన్నారు. నిబంధనలు సడలించి నియామకాలు చేపట్టాలని వారు కోరారు. సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఎ.డేవిడ్, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభినందన

అమలాపురం రూరల్: సాకుర్రుకు చెందిన తాడికొండ సంజయ్ పీజీ సెట్‌లో జాతీయ స్థాయిలో మూడో ర్యాంక్ సాధించి బెంగళూరు నిమ్స్ మెడికల్ కాలేజీలో న్యూరాలజీ విభాగంలో సీటు సాధించాడు. ఈ మేరకు సంజయ్‌ను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గురువారం అభినందించారు.

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న నందకిశోర్

యానాం: వరి సాగులో ఆధునిక పద్ధతులు, మెలకువలను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నందకిశోర్ అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమ కార్యాలయంలో ఆత్మ పథకం ద్వారా రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో నష్టాలను నివారించి నూతన పద్ధతులు అవలంబించే విధానాల గురించి వివరించారు. అదేవిధంగా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అమలాపురం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ కృష్ణాజీ, మార్టేరు ప్రాంతీయ వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.వెరోనికా, వ్యవసాయాధికారి చిక్కాల జోగిరాజు, ఆత్మ సిబ్బంది పి.చినబాబు, ఫీల్డ్‌మెన్లు కేవీ సుబ్బారావు, ఐకే ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన ప్రోత్సాహకులకు సత్కారం


జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్ సాగర్‌ను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: గ్రామాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి అనేక యూనిట్ల రక్తాన్ని సేకరించి అత్యవసర సమయాల్లో ఎంతోమందికి ప్రాణదానం చేస్తున్న రక్తదాన ప్రోత్సాహకులను రోటరీ క్లబ్ ఘనంగా సత్కరించింది. గురువారం కాకినాడలో రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండలానికి చెందిన రక్తదాన ప్రోత్సాహకులు, జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్, ధూళిపూడి వెంకటరమణలను రోటరీ క్లబ్ ప్రతినిధులు రామకృష్ణ, ఎస్‌వీఎస్ రావు, పసుపులేటి కామరాజులు సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి వర్మ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించి ప్రోత్సహిస్తున్న వారిని సత్కరించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. తమ క్లబ్ ద్వారా గత సంవత్సరంలో 5 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు. ట్రెజరర్ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో విద్యార్థుల భవిత బంగారం

డీఈఓ కమలకుమారి


అంబాజీపేటలో నిర్వహిస్తున్న ర్యాలీలో డీఈఓ విమలకుమారి

అంబాజీపేట: చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించి, పిల్లలను పాఠశాలలకు పంపాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ-1 కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నేను బడికి పోతా విద్యా ప్రవేశ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ కమలకుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో పాఠశాలలకు వచ్చే కోరికను కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని, దానికి విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ నెల 6 నుంచి జూలై 12 వరకు నెల రోజుల పాటు క్షేత్ర స్థాయిలో సర్వే చేసి, బయట తిరుగుతున్న 6 నుండి 14 ఏళ్ల బడిఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఎంపీడీఓ చైర్మన్‌గా ఆయా గ్రామాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, సోషల్ వెల్ఫేర్ కమిటీ, పేరెంట్స్ కమిటీ, ఐసీడీఎస్ సిబ్బంది, సచివాలయ సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు బృందంగా ఏర్పడి, బయట తిరుగుతున్న పిల్లలను గుర్తించాలన్నారు. వారి తల్లిదండ్రుల సహకారంతో బడిలో చేర్పించాలన్నారు. బడిఈడు పిల్లలందరినీ స్కూళ్లలో చేర్పించి, బడి బయట పిల్లల్లేని గ్రామాలుగా ప్రకటించుకోవాలన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్టూడెంట్ కిట్లతో పాటు, విద్యా ప్రోత్సాహకాలపై పిల్లల తల్లిదండ్రులకు తెలపాలన్నారు. కమిటీలు బాధ్యతగా వ్యవహరించి, ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు. అనంతరం నేను బడికి పోతా అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏపీసీ మధుసూదనరావు, ఎంపీడీఓ జి.సరోవర్, డీవైఈఓ కె.సూర్యప్రకాశరావు, ఏపీఓ ఎంఏకే భీమారావు, ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ జి.రమేష్, తహసీల్దారు జె.విమలకుమారి, ఎంఈఓ-2 మోకా ప్రకాష్, హెచ్ఎంలు కె.సాయిరామ్, పీవీ కేశవాచార్యులు, పంచాయతీ కార్యదర్శులు జీజీవీకే కుమార్, వి.లక్ష్మీపతి, కాంప్లెక్స్ హెచ్ఎంలు, సీఆర్పీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.